క్లుప్తంగా

రైల్వే జంక్షన్ అభివృద్ధి కమిటీ ఎంపిక


సభ్యులకు ఐడీ కార్డులు ప్రదానం చేస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి రైల్వే జంక్షన్ అభివృద్ధి కమిటీని గురువారం ఎంపిక చేశారు. రైల్వే ఉన్నతాధికారులు అభివృద్ధి కమిటీ సభ్యులుగా విజయభాస్కర్, కృష్ణయ్య, అనంతగిరి, రవికుమార్, ఆనంద్ బాబును ఎంపిక చేశారు. గుత్తి రైల్వే స్టేషన్‌లో స్టేషన్ మాస్టర్ సురేష్ కమిటీ సభ్యులకు ఐడీ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ రైల్వే జంక్షన్‌ను అభివృద్ధి చేయడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు.

ఈ-కేవైసీ తప్పనిసరి

పామిడి: రేషన్ కార్డు లబ్ధిదారులు ఈ నెల 30లోపు తప్పనిసరి ఈ-కేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ ఎస్. శ్రీధరమూర్తి గురువారం సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని డీలర్లు, ఎండీయూ వాహనదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ-కేవైసీ చేయించుకోని వారికి ఈ నెల రేషన్ సరుకుల పంపిణీ నిలిపి వేస్తామన్నారు. మండలంలో 2,950 మంది ఈ-కేవైసీ పెండింగ్ ఉందన్నారు. కార్యక్రమంలో సీఎస్‌డీటీ కంబక్క, అధికారులు పాల్గొన్నారు.

కసాపురంలో పూర్వాభాద్ర హోమం


పూర్వాభాద్ర హోమాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: స్వామి వారి జన్మ నక్షత్రమైన పూర్వాభాద్రను పురస్కరించుకుని గురువారం కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో పూర్వాభాద్ర హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ యాగశాలలో ఆంజనేయస్వామి ఉత్సవమూర్తిని కొలువుదీర్చి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య పూర్వాభాద్ర హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

5న క్రికెట్ టోర్నీ

బుక్కరాయసముద్రం: మండలంలోని కొర్రపాడులో మే5న ప్రధాన మంత్రి నరేంద్రమోదీ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షులు భూమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో సీఐ పుల్లయ్య చేతుల మీదుగా క్రికెట్ టోర్నీ పోస్టర్లు విడుదల చేశారు. విన్నర్ జట్టుకు రూ.50 వేలు, రన్నర్ జట్టుకు రూ.30 వేలు అందజేయనున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షుడు పూల రాజేష్, నాయకులు సాయినాథ్‌రెడ్డి, మనోహర్, నారాయణస్వామి, రామానాయుడు పాల్గొన్నారు.

స్కేటింగ్ శిక్షణ ప్రారంభం


స్కేటింగ్ శిక్షణను ప్రారంభిస్తున్న దృశ్యం

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని కేపీఎస్ అవెన్యూలో గురువారం చిన్నారులకు స్కేటింగ్ శిక్షణ ప్రారంభమైంది. స్కేటింగ్ కోచ్ మాస్టర్ రాజశేఖర్ స్కేటింగ్ శిక్షణను ప్రారంభించారు. స్కేటింగ్ శారీరక దృఢత్వానికి, మానసికోల్లాసానికి ఉపయుక్తంగా ఉంటుందని, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

'లైంగికంగా వేధిస్తున్నారు'

పెద్దవడుగూరు: మండలంలోని రావులుడికి గ్రామానికి చెందిన కమ్మర కళావతి గురువారం అదే గ్రామానికి చెందిన పసుపు జయరామిరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, చరణ్‌కుమార్‌రెడ్డిలు లైంగికంగా వేధిస్తున్నారని గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీఅలాగే నాగమ్మ, పవిత్ర, లలితమ్మ అనే మహిళలు తనతో తరుచూ గొడవలకు దిగుతూ తన భర్త జయప్రసాద్‌ను కొట్టి గాయపరిచారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

జీవనాలయానికి సరుకుల వితరణ


సరుకులను అందజేస్తున్న రాంకో సిమెంట్స్ అడ్మిన్ హెడ్ రామరాజు, సిబ్బంది

తాడిపత్రి: రాంకో సిమెంట్స్ ఫౌండర్ పీఏసీ రామస్వామి రాజు 131 వర్ధంతిని పురస్కరించుకుని, సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని, ఆవులతిప్పాయపల్లి వద్ద ఉన్న జీవనాలయానికి రాంకో సిబ్బంది గురువారం రూ. లక్ష విలువ చేసే సరుకులను వితరణ చేశారు. కార్యక్రమంలో రాంకో సిమెంట్స్ అడ్మిన్ హెడ్ రామరాజు, అకౌంట్స్, వైస్ ప్రెసిడెంట్ వెంకట్రామన్, ఏవీపీ సూర్యకాంత్, సీనియర్ జీఎం రవికుమార్, పీఆర్వో భరత్‌రెడ్డి, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

ఐస్ ఆపిల్‌కు డిమాండ్

- రూ.100కు 15 తాటిముంజెలు
- యల్లనూరు నుంచి తాడిపత్రికి సరఫరా


తాటి కాయల నుంచి ముంజెలను బయటకు తీస్తున్న దృశ్యం

తాడిపత్రి రూరల్: ఎండల నేపథ్యంలో తాటి ముంజెలకు డిమాండ్ పెరిగింది. తాటి ముంజెలను ఐస్ ఆపిల్‌గా పిలుస్తారు. వేసవి ఎండల నుంచి ఉపశమనం పొందడానికి తాటి ముంజలు ఉపయోగకరంగా ఉంటున్నాయి. తాడిపత్రి పట్టణంలో తాటి ముంజెల అమ్మకాలు జోరందుకున్నాయి. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సర్కిల్, యల్లనూరు రోడ్డు సర్కిల్, అశోక్ పిల్లర్, పుట్లూరు రోడ్డు తదితర చోట్ల రోడ్లపై ఎర్రటి ఎండలో కుర్చోని పలువురు మహిళలు గంపల్లో తాటి ముంజెలను పెట్టుకొని విక్రయిస్తున్నారు.

రూ.100కు 15 ముంజెలు

తాటి గెలలను తీసుకొచ్చి కొనుగోలు చేసే వారి సమక్షంలో తాటి ముంజెలను బయటకు తీస్తే రూ.100లకు 15 చొప్పున విక్రయిస్తున్నారు. గంపల్లో పెట్టుకొని విక్రయించే వారు డజన్ తాటి ముంజెలు రూ.80కు అమ్ముతున్నారు. తాటి ముంజెలు ఆరోగ్య పరంగా ఎన్నో రుగ్మతలను దివ్య ఔషధంగా ఉపయోగపడుతుండటంతో కొనుగోలు చేయడానికి ప్రజలకు ఆసక్తి చూపుతున్నారు. రక్తపోటు అదుపులో ఉంచడానికి, చెడు కొలస్ట్రాల్ తగ్గించడానికి, శరీరంలోని వ్యర్థ పదార్థాలను బయటకు పంపడానికి, శరీరంలో తేమ శాతాన్ని పెంచడానికి, వేసవిలో వచ్చే చికెన్ పాక్స్ వ్యాధిని తగ్గించడానికి ముంజెలు ఎంతో ఉపయోగపడుతాయి.



యల్లనూరు నుంచి తాడిపత్రికి రవాణా

యల్లనూరు మండల కేంద్రంలో ఎక్కువగా తాటి చెట్లు ఉన్నాయి. ఇక్కడ ఉన్న ప్రభుత్వ ఫారెస్టుతో పాటు ప్రైవేట్ స్థలాల్లో తాటిచెట్లు విస్తరించాయి. కోతకు వచ్చే సమయంలో తాటి చెట్లను ఫారెస్టు అధికారులు వేలం వేస్తారు. వేలం ద్వారా వచ్చిన అదాయంలో కొంత మొత్తం లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి ఇస్తారు. వేలం పాటిన వ్యక్తులు రోజూ తెల్లవారుజామున కూలీల ద్వారా తాటిచెట్ల నుంచి గెలలను కిందికి దించుతారు. అప్పటికే తాటి గెలలు, కాయల కోసం వచ్చిన గంప వ్యాపారులకు విక్రయిస్తారు. వివిధ మార్గాల ద్వారా తాడిపత్రికి తీసుకొచ్చి వాటిని విక్రయిస్తారు.



దిగుబడి లేక ధర ఎక్కువ

తాటి ముంజెల కోత ప్రారంభం కావడంతో ప్రజలు కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. గతంలో మాదిరి దిగుబడి లేకపోవడంతో ధర ఎక్కువగా ఉంటోంది. కూలి గిట్టుబాటు కోసం ధర ఎక్కువగా అమ్ముతున్నాం. గెలల నుంచి తాటి ముంజెలను వారి సమక్షంలో వేరు చేయడం వల్ల ఫ్రెష్‌గా ఉంటున్నాయి.

– రాము, యల్లనూరు



20 ఏళ్లకుపైగా వ్యాపారం చేస్తున్నా

20 ఏళ్లగా తాటి ముంజెల వ్యాపారం చేస్తున్నాను. కేవలం నెల రోజులు మాత్రమే వ్యాపారం ఉంటోంది. తాటి ముంజెల వల్ల ఖర్చులు పోనూ కొంతవరకూ మిగులుతోంది. తాటి ముంజెలను విక్రయించే వారు ఎక్కువయ్యారు. ముంజెల వ్యాపారం ముగిసిన అనంతరం తిరిగి వ్యవసాయ పనులను వెళ్తాను.

– లక్ష్మీదేవి, యల్లనూరు

ఉగ్రవాదుల దాడి పిరికిపందల చర్య


ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి: ఫహల్గామ్‌లో హిందువులపైన కాల్పులు జరిపిన ఉగ్రవాదులు దాడి పిరికిపందల చర్య అని తాడిపత్రి సీపీఐ నాయకులు గురువారం తీవ్రంగా ఖండించారు. రూరల్ పరిధిలోని పాత బ్రిడ్జి సమీపంలో తాడిపత్రి సీపీఐ మండల కార్యదర్శి ఎ. నాగరంగయ్య ఆధ్వర్యంలో నాయకులు ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ దేశంలో మతసామరస్యాన్ని చూసి ఓర్వలేకనే ఉగ్రవాదులు దాడికి పాల్పడి, పలువురిని పొట్టన పెట్టుకున్నారన్నారు. ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు టి. రంగయ్య మాట్లాడుతూ దేశ సమైఖ్యతను దెబ్బ తీయడానికి ఉగ్రవాదులు ఇలాంటి చర్యలకు దిగుతున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఎ. నారాయణరెడ్డి, నాయకులు ఎర్రప్ప, వెంకటయ్య, కృష్ణమాచార్యులు, లక్ష్మీనారాయణ, సురేష్, రామలక్ష్మమ్మ, మంగమ్మ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్ర దాడికి నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తులతో నిరసన వ్యక్తం చేస్తున్న అఖిల పక్ష నాయకులు


నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ సైనిక సంఘం ఉద్యోగులు

తాడిపత్రి రూరల్: పట్టణంలో గురువారం అఖిల పక్షం ఆధ్వర్యంలో పులగామ్‌లో జరిగిన ఉగ్రవాదుల దాడుల్లో అశువులు బాసిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన చేశారు. పట్టణంలోని గాంధీకట్ట నుంచి ప్రారంభమైన శ్రద్ధాంజలి ర్యాలీ పట్టణ పోలీసు స్టేషన్ సర్కిల్, యల్లనూరు రోడ్డు మీదగా గాంధీ సర్కిల్‌కు చేరుకొంది. గాంధీ సర్కిల్‌లో మానవహారంగా నిలిచి ఉగ్రవాదాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. ఈసందర్భంగా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ పెంచి పోషిస్తోందన్నారు. ఉగ్రవాదులను ఏరివేయడానికి దేశమంతా ఒకే తాటిపై నిలవాలన్నారు. బీజేపీ రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ ప్రతాప్‌రెడ్డి, నాయకులు రాధాక్రిష్ణ, లక్ష్మీనారాయణ, టీడీపీ నాయకుడు జగదీశ్వరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకుడు సురేంద్ర, మహిళలు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని అశోక్ పిల్లర్ వద్ద గురువారం సాయంత్రం మాజీ సైనిక ఉద్యోగులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. కార్యక్రమంలో సైనిక ఉద్యోగుల సంఘం మాజీ అధ్యక్షుడు వీరయ్య, సెక్రటరీ రంగారెడ్డి, సభ్యులు పీరయ్య, రఘునాథరెడ్డి, రఫీ, బాషా, చెన్నారెడ్డి, పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై దాడులు ఆపాలి


మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

గుత్తి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు పెరిగాయని, దాడులను ఆపకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కొవలసి ఉంటుందని వైఎస్సార్ సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి హెచ్చరించారు. గుత్తిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బుధవారం గుంతకల్లు నియోజక వర్గం సోషల్ మీడియా కన్వీనర్ జయరామిరెడ్డిపై పచ్చ మూకలు దాడులు చేశాయన్నారు. దాడులు ఆపకపోతే భవిష్యత్‌లో తీవ్ర పరిణామాలు ఉంటాయన్నారు. గత ఐదేళ్లలో వైఎస్ జగన్ సర్కార్ ఫ్యాక్షన్ లేకుండా చేసిందన్నారు. ప్రస్తుతం కూటమి నాయకులు ఫ్యాక్షన్ కు ఆజ్యం పోశారన్నారు. ఇక నైనా దాడులు, దౌర్జన్యాలు, అరాచకాలు మానుకుని పాలనపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ గాదిలింగ, యాగంటి, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


ప్రచార సామగ్రిని విడుదల చేస్తున్న బాలల పరిరక్షణ అధికారి వెంకటేశ్వరి తదితరులు

గుత్తి రూరల్: బాలల హక్కులు, చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని బాలల పరిరక్షణ సంస్థ జిల్లా అధికారి ఎం.వెంకటేశ్వరి సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో చిల్డ్రన్స్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో బాలల హక్కులు, బాల్యవివాహాల నిరోధం, పోక్సో చట్టం, సైబర్ నేరాలపై గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకటేశ్వరి మాట్లాడుతూ.. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. వేసవి సెలవుల్లో పిల్లల కదలికలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలన్నారు. బాలువు, కుంటల్లో ఈతకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే వస్తే స్పందించరాదన్నారు. చెడు స్పర్శ, మంచి స్పర్శ గురించి ఎంఎస్‌ఓటీ సంస్థ ప్రతినిధి లక్ష్మి వివరించారు. బాలికల ప్రవర్తనా నియమావళి కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం అరుణ కుమారి, సీసీలు రామలింగం, నాగరాజు, రంగనాయకులు, మీన, ఎంఎస్‌ఏబీ ప్రతినిధులు లక్ష్మి, చాంద్‌బీ, విజయలక్ష్మి, ఎంఎస్‌ఏ మంజుల, సామాజిక కార్యకర్త బాలాజీ పాల్గొన్నారు.

ప్రతిభావంత విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పామిడి: పట్టణంలోని సరస్వతి ఉన్నత విద్యామందిరంలో గురువారం పదో తరగతి ప్రతిభావంత విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభావంత విద్యార్థులు ఏ గీతిక(587 మార్కులు), పీ నిరంజన్‌రెడ్డి(579), పీ అమూల్య, జీ సుమ(578), వీ పవన్ రాఘవేంద్ర(574)ను ఆ పీఠం జిల్లా అధ్యక్షుడు కే రాంప్రసాద్, పాఠశాల అధ్యక్షుడు జే శ్రీనివాసరావు, సభ్యులు చౌడయ్య, టీవీ రత్నమయ్య, జోజోడే కుమార్, విశ్వనాథ్ తదితరులు అభినందించారు. ఉత్తమ ఫలితాల సాధనలో ఉపాధ్యాయుల కృషిని వారు ప్రశంసించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసరావు, ఆచార్యబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల టాపర్‌కు సన్మానం

పుట్లూరు: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన అక్షయ అనే విద్యార్థిని పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 568 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థినికి ఎంఈఓ శ్రీదేవి, ప్రేమ్‌కుమార్‌తో పాటు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఓబుళరెడ్డి అభినందనలు తెలపడంతో పాటు సన్మానించారు.

ఉపాధ్యాయుడికి ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న ఉపాధ్యాయులు

తాడిపత్రి: బ్రెయిన్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడికి తోటి ఉపాధ్యాయులు గురువారం రూ. 1,17,000 ఆర్థికసాయం అందించారు. వివరాలు.. మండలంలోని వంగనూరు ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న వెంకటరమణ బ్రెయిన్ క్యాన్సర్ బారినపడ్డారు. ఆ కుటుంబ ఇబ్బందులను గుర్తించిన తోటి ఉపాధ్యాయులు రూ. 1.17 లక్షలు ఆర్థిక సాయాన్ని ఎంఈఓ కార్యాలయంలో ఎంఈఓలు నాగరాజు, గోవిందరెడ్డి చేతుల మీదుగా బాధిత ఉపాధ్యాయుడి కుమారుడికి అందజేశారు. వంగనూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు లక్ష్మీకర్ రెడ్డి రూ. 25 వేలు, ఆయన మిత్రులు, తోటి ఉపాధ్యాయుల ద్వారా నగదు సేకరించి, అనారోగ్యంతో బాధపడుతున్న ఉపాధ్యాయుడికి కుటుంబానికి అందజేసినట్లు ఎంఈఓలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, భాస్కర్‌రెడ్డి, సుబ్బారావు, రామాంజినేయులు, విష్ణువర్ధన్‌రెడ్డి, ఎమ్మార్సీ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

గేట్స్‌లో రేపు పాలిసెట్ మోడల్ పరీక్ష

గుత్తి: పట్టణంలోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో శనివారం పాలి సెట్ మోడల్ పరీక్ష నిర్వహించనున్నట్లు కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. పాలిసెట్ ద్వారా ఇంజినీరింగ్ స్ట్రీమ్ డిప్లొమా కోర్సుల్లో చేరబోయే విద్యార్థులకు ఈ మోడల్ పరీక్ష ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

నేడు మండల సమావేశం

గార్లదిన్నె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ యోగా నందరెడ్డి తెలిపారు. గురువారం ఎంపీడీఓ మాట్లాడుతూ మండల సర్వ సభ్య సమావేశంలో ప్రభుత్వశాఖలకు సంబంధించి సమీక్ష ఉంటుందన్నారు. మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరు కావాలన్నారు.

29న మున్సిపల్ సమావేశం

గుత్తి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 29న మున్సిపల్ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గ సభ్యులు తప్పకుండా హాజరు కావాలన్నారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు.

మజ్జిగ పంపిణీ

గుత్తి: పట్టణంలోని గాంధీ సర్కిల్ సమీపంలో గురువారం భగవాన్ సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు ఎంవీ రమణ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ భాస్కర్, సీనియర్ సిటిజన్ సూర్య నారాయణరెడ్డి, సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

మట్కా, పేకాటపై ప్రత్యేక దృష్టి

యల్లనూరు: మండలంలో ఎక్కడైనా మట్కా, పేకాట తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తుంటే సమాచారం ఇవ్వాలని ఎస్ఐ రామాంజనేయరెడ్డి సూచించారు. గురువారం పలు గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ప్రజలు శాంతియుతంగా జీవనం సాగించాలన్నారు. మట్కా, పేకాటపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా శాంతిభద్రతలకు విఘాతం కల్గిస్తే కఠినచర్యలు తీసుకోవడంతో పాటు జైలుకు పంపుతామన్నారు. రౌడీషీటర్లు, నేర చరిత్ర కల్గిన వ్యక్తుల కదలికలపై నిఘా పెట్టామన్నారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ నాగేంద్రప్రసాద్

పెద్దపప్పూరు: మండల కేంద్రంలో ఎస్ఐ నాగేంద్రప్రసాద్, సిబ్బంది వాహనాల తనిఖీ చేశారు. మద్యం తాగి వాహనం నడుపుతున్న వారిని పరీక్షించి జరిమానా విధించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ వాడాలాన్నరు. హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే తొలిసారి జరిమానా విధిస్తామని రెండోసారి పట్టుబడితే బండిని సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

మద్యం విక్రేత అరెస్టు

యాడికి: మద్యం బాటిళ్లు విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. గత కొంత కాలంగా మండలంలోని బోగాలకట్ట గ్రామంలో గంగరాజు మద్యం బాటిళ్లు విక్రయిస్తున్నాడని గురువారం సమాచారం రావడంతో పోలీసులు దాడి చేశారు. ఈ సందర్భంగా నిందితుడు గంగరాజును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు. అలాగే నిందితుడి నుంచి 12 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు.

ఘనంగా పంచాయతీరాజ్ దినోత్సవం


గుత్తిలో మాట్లాడుతున్న ఎంపీపీ, సర్పంచ్, అధికారులు


పామిడిలో పంచాయతీరాజ్ దినోత్సవం


బుక్కరాయసముద్రం:లో మాట్లాడుతున్న సర్పంచ్ పార్వతి


పెద్దవడుగూరులో మాట్లాడుతున్న ఈఓఆర్‌డీ నరసింహారెడ్డి


యాడికిలో మాట్లాడుతున్న ఈఓ అశ్వర్థనాయుడు

గుత్తి రూరల్/పామిడి/యాడికి/పెద్దవడుగూరు/బుక్కరాయసముద్రం: గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ . స్వయం ప్రతిపత్తి కలిగిన పంచాయతీరాజ్ వ్యవస్థ ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమన్నారు. పంచాయతీ అధికారులు తమ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలన్నారు. అలాగే పంచాయతీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక నిధులు విడుదల చేయాలని ఎంపీపీలు కోరారు. అంతకుముందు మహాత్మాగాంధీ, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

- గుత్తి ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ గాండ్లపాటి విశాలాక్షి మాట్లాడుతూ పంచాయతీ రాజ్ వ్యవస్థ ద్వారా గ్రామాల్లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు కార్యక్రమంలో ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శులు ధనలక్ష్మి, సాదిక్, ఊబిచెర్ల సర్పంచ్ చిదంబరి, ఎంపీటీసీ వీరన్నగౌడ్, ఉపాధిహామీ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.
- పామిడిలోని ఎంపీడీఓ సభాభవనంలో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తేజోత్స్న, మండల ఇంజనీరు హేమ్లానాయక్, ఎంపీడీఓ కార్యాలయ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.
- యాడికిలోని పంచాయతీ కార్యాలయంలో సర్పంచు అనురాధ, పంచాయతీ ఈఓ అశ్వర్థ నాయుడు పంచాయతీ రాజ్ దినోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.
- పెద్దవడుగూరు ఎంపీడీఓ కార్యాలయం పంచాయితీ రాజ్ దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బారెన్ సాహెబ్, ఎంపీపీ శ్రీదేవి, ఈఓఆర్‌డీ నరసింహారెడ్డి, పంచాయతీరాజ్ ఇంజినీర్ వరప్రసాద్, సర్పంచులు, పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు.
- బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని సచివాలయంలో ఎంపీడీఓ కార్యాలయం, అన్ని పంచాయతీ కార్యాలయాల్లో జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవ వేడుకలు ఘణంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీకేఎస్ మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతామన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ సునీత, ఎంపీడీఓ సాల్మాన్ తదితరులు గాంధీ చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరి శ్రీనివాసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాగునీటి సమస్య తలెత్తకుండా రూ. 90 లక్షలు వెచ్చించి 16 బోర్లు ఏర్పాటు చేశామన్నారు. ఇందులో ఆరు బోర్లలో నీళ్లు పడలేదన్నారు. మిగతా 10 బోర్ల నుంచి సమృద్ధిగా నీళ్లు వస్తున్నాయన్నారు. ట్యాంకర్ల ద్వారా కూడా నీటిని సరఫరా చేయిస్తున్నామన్నారు. ఎక్కడైనా తాగునీటి సమస్య వస్తే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.